క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొరిటిపాడు: విద్యుత్ లైన్ నిర్వహణలో భాగంగా శనివారం సరఫరాలో అంతరాయం ఉంటుందని గుంటూరు టౌన్–2 డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.గురవయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అంతరాయం కలుగుతుందని చెప్పారు. స్తంభాలగరువు, సాయినగర్, శ్యామలానగర్, రవీంద్రనగర్, పట్టాభిపురం, తదితర ప్రాంతాల వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి



గుంటూరు ఎడ్యుకేషన్: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) జాతీయ కార్యవర్గ సభ్యురాలు అంబటి వేదశ్రీ డిమాండ్ చేశారు. బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఏబీవీపీ గుంటూరు శాఖ ఆధ్వర్యంలో లాడ్జి సెంటర్‌లో ఆందోళన నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఫీజులు కట్టుకునే స్తోమత లేక, ఉన్నత చదువులను చదవాలనుకునే విద్యార్థుల జీవితాలను ప్రశ్నార్థకంగా మార్చేశారని విమర్శించారు. రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎం.పవన్ కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి దాదాపు 16 నెలలు కావస్తున్నా ఫీజు బకాయిల విడుదలపై ఎటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే పెండింగ్‌లో ఉన్న రూ.6,400 కోట్లు విడుదల చేస్తామని యువగళం పాదయాత్రలో చెప్పి కాలం గడిపేస్తున్న విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కళ్లు తెరిచి చూడాలన్నారు.

కృపా దాస్ ప్రతిభకు పట్టం



కొరిటిపాడు: రాష్ట్ర వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు వి.డి.వి.కృపాదాస్‌ను గురువారం హైదరాబాదులో ఉమ్మడి రాష్ట్రాల సీడ్స్ మెన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉత్తమ ఉద్యోగి పురస్కారం అందించడంపై వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మ చరణ్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పి.చంద్రశేఖర్‌లు శుక్రవారం ఒక సంయుక్త ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. నిబద్ధతకు నిలువుటద్దం, ప్రతిభకు ప్రతిరూపమైన కృపాదాస్ ఈ గౌరవం అందుకోవడం గర్వకారణం అన్నారు. రైతులకు కృపాదాస్ విశేష సేవలు అందించారని ప్రశంసించారు. వ్యవసాయ శాఖ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్న కృపాదాస్, భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఉత్తమ ఉద్యోగి పురస్కారం అందుకున్న కృపాదాస్‌ను వేద సీడ్స్ తరఫున ఘనంగా సత్కరించారు.

29న జీఎంసీ వద్ద సీపీఐ ధర్నా

లక్ష్మీపురం: నగరంలో పారిశుద్ధ్యం పూర్తిగా పడకేసిందని సీపీఐ నగర కార్యదర్శి ఆకిటి అరుణ్ కుమార్ విమర్శించారు. గుంటూరు కొత్తపేట సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, కలుషితమైన నీటి వలన డయేరియా, కలరా వంటి వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయని చెప్పారు. డ్రెయిన్ల అభివృద్ధి పేరుతో ప్రజలకు మరింత ఇబ్బందులు తెచ్చిపెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కరించాలన కోరుతూ ఈనెల 29న గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో సీపీఐ నాయకులు నూతలపాటి చిన్న, మంగ శ్రీనివాసరావు, విరిగినేని వెంకటేశ్వర్లు, జంగాల చైతన్య, కురాకుల రాం ప్రసాద్ పాల్గొన్నారు.

రోగుల బంధువులకు బియ్యం పంపిణీ

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో 32వ వారం 'జీజీహెచ్‌లో మీకోసం మేము' కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కేంద్రం ప్రభుత్వం ఎస్ఎన్ఎస్ఏ బృందం 'స్వస్త నారీ సశక్త్ పరివార్ కార్యక్రమం నిర్వహించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ మాట్లాడుతూ చేతులు సబ్బుతో శుభ్రం చేసుకోవాలన్నారు. ఆరోగ్యం కోసం నిత్యం కాచి చల్లార్చిన నీరు వడపోసి తాగాలని సూచించారు. జాగృతి సంస్థ వారు రోగుల బంధువులకు ఉచితంగా బియ్యం పంపిణీ చేశారు.

ధనేకుల వెంకటేశ్వరరావు చిరస్మరణీయుడు

లక్ష్మీపురం: కవి ధనేకుల వెంకటేశ్వరరావు గుంటూరు వాసుల గుండెల్లో చిరస్మరణీయుడుగా నిలిచిపోతారని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, సీమాంధ్ర మేధావుల ఫోరం కన్వీనర్ పి.ఎస్.మూర్తి అన్నారు. గుంటూరు అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శుక్రవారం వెంకటేశ్వరరావు జయంతి నిర్వహించారు. తొలుత ఆయన చిత్ర పటానికి పూల మాలలతో నివాళులర్పించారు. అనంతరం కవి జమదగ్ని, పింగళి భాగ్యలక్ష్మి , శేష ఫణి శర్మ నివాళులర్పించారు.


ఎస్‌వీఎన్‌కాలనీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో మహాలక్ష్మీదేవిగా అమ్మవారు


ఆర్.అగ్రహారం వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో విజయలక్ష్మీదేవిగా..


ఆర్‌అగ్రహారం కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో గాయత్రిదేవిగా..


కొత్తపేట శ్రీజగన్నాథస్వామి దేవస్థానంలో ధైర్యలక్ష్మీదేవిగా..


లాలాపేట శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీధైర్యలక్ష్మీదేవిగా..


రెడ్లబజార్ శ్రీకనకదుర్గమ్మ అమ్మవారి దేవస్థానంలో శ్రీమహాలక్ష్మీదేవిగా..

జగన్మాతకు ప్రణమిల్లి..

నగరంలో శ్రీ దేవీ శరన్నవరాత్రులు ఐదో రోజుకి చేరాయి. శుక్రవారం శ్రీమహాలక్ష్మీదేవి, శ్రీరాజరాజేశ్వరి దేవీ అమ్మవార్ల అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు దేవాలయాలకు చేరుకుని అమ్మవార్ల దర్శనం చేసుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. సువాసినులచే కుంకుమార్చనలు నిర్వహించారు.
- నగరంపాలెం


మారుతీనగర్ శ్రీమారుతీదేవాలయంలో శ్రీమహాలక్ష్మీదేవిగా అమ్మవారు


బ్రాడీపేట 2/14లోని శంకర మందిరంలో శ్రీమహాలక్ష్మీదేవిగా..


బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో శ్రీమహాలక్ష్మీదేవిగా..


అరండల్‌పేట శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో రాజరాజేశ్వరిగా..


సిద్ధార్థనగర్ కనకమహాలక్ష్మీ మందిరంలో మహాలక్ష్మీదేవిగా..


వికాసనగర్ 11వ వీధిలో షిరిడి సాయిమందిరంలో మహాలక్ష్మీదేవిగా..

రివ్యూలకే పరిమితమవుతున్న అధికారులు


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నూరిఫాతిమా తదితరులు

- వేడుక చూస్తున్న ఎమ్మెల్యే నసీర్ అహ్మద్
- కలెక్టరేట్ ముందు ధర్నాలో వైఎస్సార్ సీపీ గుంటూరు నగర అధ్యక్షురాలు నూరిఫాతిమా

గుంటూరు వెస్ట్: ప్రజలు రోగాల బారిన పడి ఆర్తనాదాలు చేస్తుంటే అధికారులు రివ్యూలతోనూ, ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ వ్యక్తిగత పనుల్లో బిజీగా ఉంటున్నారని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు షేక్ నూరిఫాతిమా దుయ్యబట్టారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ ముందు డయేరియా, కలరా, బాధితుల ఆదుకోవాలని ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా నూరిఫాతిమా మాట్లాడుతూ పదిరోజుల నుంచి నగర ప్రజలు అల్లాడుతుంటే జిల్లా యంత్రాంగం వేడుక చూస్తుందని ఆరోపించారు. ప్రజల ప్రాణాలంటే ప్రభుత్వానికి పట్టడం లేదని, మరీముఖ్యంగా కొందరు అధికారులు ప్రజలను ప్రైవేటు హాస్పటల్స్‌కు వెళ్లమని ఉచిత సలహాలు ఇస్తున్నారని పేర్కొన్నారు.


లోపాల్ని గుర్తించారా..

డయేరియా, కలరా వ్యాధులు ప్రబలుతుంటే అధికారులు సమీక్షలు చేస్తున్నారని, అసలు సమస్య ఎక్కడ ఉందో ఇప్పటి వరకు ఎవరూ చెప్పకపోవడం విడ్డూరంగా ఉందని నూరిఫాతిమా ఆశ్చర్యం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియాకు వినతి పత్రం ఇచ్చేందుకు తన చాంబర్‌కు వెళ్లిన నూరిఫాతిమాను దాదాపు అరగంటకు పైగా వేచి ఉండేలా చేశారు. వీడియో సమావేశ మందిరంలో అధికారుల సమావేశంలో ఉన్న కలెక్టర్‌కు సమాచారం అందించి నూరిఫాతిమాతో పాటు, మరో ఇద్దరిని మాత్రమే అనుమతించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు నిమ్మకాయల రాజనారాయణ, లియాఖత్ తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యంతోనే డయేరియా


పట్నంబజారు: ప్రజల ప్రాణాలతో కూటమి నేతలు చెలగాటం ఆడుతున్నారని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా ఆరోపించారు. నియోజకవర్గంలోని పొన్నూరు రోడ్డు బ్రహ్మానందరెడ్డి స్టేడియం సమీపంలోని తాగునీటి ట్యాంకులను శుక్రవారం పార్టీ నేతలతో కలిసి ఆమె పరిశీలించారు. ఆనందపేట, ప్రగతినగర్, రామిరెడ్డితోట తదితర ప్రాంతాల్లో పర్యటించారు. నీటి సరఫరా పూర్తిగా కలుషితమై వస్తుందని ఈసందర్భంగా ప్రజలు ఆమె దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన నూరిఫాతిమా నీటిసరఫరా, పారిశుద్ధ్య నిర్వహణలో అధికారులు పూర్తి స్థాయిలో విఫలమయ్యారని అసంతృప్తి వ్యక్తం చేశారు. నగరంలో డయేరియా, కలరా వ్యాధులు ప్రబలడానికి కారణమైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తూర్పు ఎమ్మెల్యే ఎం.డి.నసీర్ అహ్మద్ తనకు పట్టదన్నట్లు వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. ఆనందపేట ప్రాంతంలో వ్యాధులతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పటికే ఒక వృద్ధురాలు మృతి చెందినట్లు సమాచారం ఉందన్నారు. కేవలం కూటమి నేతల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వంతోనే వ్యాధులు ప్రబలుతున్నాయని ధ్వజమెత్తారు. ప్రభుత్వ పెద్దలు సిగ్గు ఎగ్గు లేకుండా రూ. 300 ఖరీదు చేసే మెడికల్ కిట్‌లను ఇస్తూ అవేవో పెద్ద గొప్పగా అన్నట్లు ప్రచారం చేయడం కూటమి నేతలకే దక్కుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎంతటి పోరాటానికైనా వెనుకాడమని స్పష్టం చేశారు.

దేశీయ వైద్యుల గుర్తింపునకు ప్రాధాన్యం


జీఓ కాపీ చూపుతున్న సంఘం ప్రతినిధులు

నగరంపాలెం: ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలో ఆయుష్ విభాగం ద్వారా సంప్రదాయ దేశీయ వైద్యం, వైద్యుల ప్రాధాన్యాన్ని గుర్తిం అధిక ప్రాధాన్యం కల్పిస్తున్నారని ఏపీ దేశీయ వైద్య సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి 'వైద్య' నామాల శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం అరండల్‌పేట ఏపీ దేశీయ వైద్య సంఘం రాష్ట్ర కార్యాలయంలో అత్యవసర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఔషధ, సుగంధ మొక్కల బోర్డు నిర్వహణలో దేశీయ వైద్యుల వివరాలు, వారి నైపుణ్యాలను సేకరించి అందించే బాధ్యతను తమ సంఘానికి అప్పగించిందని చెప్పారు. సంఘం తరుపున నిర్వహించే కార్యక్రమాలపై ఇటీవల జరిగిన సంఘం రాష్ట్రస్థాయి సమావేశంలో రాష్ట్ర ఔషధ సుగంధ మొక్కల బోర్డు సీఈఓ చంద్రశేఖర్ సంతోషం వ్యక్తం చేశానని గుర్తు చేశారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పివి.హనుమంతరావు, కె. అంజి బాబు, పి.రామారావు, కేఎస్‌వీ శ్రీనివాసరావు, ఎస్.మురళీమోహన రావు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న సయ్యద్ బాషా

గుంటూరు మెడికల్: బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ బాషా రాష్ట్ర పర్యటనలో భాగంగా శుక్రవారం గుంటూరు జిల్లా బీజేపీ కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా జిల్లాలో మైనార్టీ మోర్చా ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. మైనార్టీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సాంబశివరావు, హేమంత్ సోలంకి హాజరయ్యారు. రాష్ట్ర మైనార్టీ మోర్చా అధ్యక్షుడు సయ్యద్ బాషా మాట్లాడుతూ రాబోయే రోజుల్లో మైనార్టీ మోర్చాని జిల్లాలో బలోపేతం చేయడం కోసం కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రధాని నరేంద్ర మోదీ మైనార్టీల కోసం పలు సంక్షేమ పథకాలను అమల్లోకి తీసుకువచ్చారన్నారు. జిల్లా అధ్యక్షులు చెరుకు తిరుపతిరావు మాట్లాడుతూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీన్ మాధవ్ బాధ్యతలు తీసుకున్న తర్వాత పార్టీలో అనేక కార్యక్రమాలను చేస్తూ ముందుకు వెళ్తున్నారన్నారు. కార్యక్రమంలో మైనారీ మోర్చా రాష్ట ఉపాధ్యక్షుడు అబుల్ కుద్దూస్, రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ షేక్ రఫీ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గౌస్ పీరా, మైనారిటీ నాయకులు షేక్ మహబూబ్, డి హుస్సేన్, షేక్ మౌలాలి, షేక్ ఫరహానా, షేక్ బిలాల్ పార్లమెంట్ సంయోజక్ భీమినేని చంద్రశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి బజరంగ్ రామకృష్ణ, చరక కుమార్ గౌడ్, కొక్కెర శ్రీనివాస్ యాదవ్, కొర్ర శ్రీనివాస్ నాయక్, మండల అధ్యక్షులు తంగా లక్ష్మణ్ రావు, నాయకులు తాడువాయి రామకృష్ణ, తాను చింతల అనిల్, రాజేష్ నాయుడు, టీవీ రమణ పాల్గొన్నారు.

సమాజాన్ని సాహితీకరించిన మహాకవి జాషువా

నగరంపాలెం: తన సమకాలీనతే కాక భవిష్యత్‌ని దర్శించి సమాజాన్ని సాహితీకరించిన చేసిన మహాకవి గుర్రం జాషువా అని దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొరివి వినయకుమార్ అన్నారు. జాషువా జయంతి వారోత్సవాల్లో భాగంగా జాషువా కళాపీఠం ఆధ్వర్యంలో శుక్రవారం నగరంపాలెంలోని జాషువా విగ్రహం వద్ద మహాకవి జాషువా జీవితం– సాహిత్యంపై సభ నిర్వహించారు. సభకు ఏపీపీ పరిశపోగు సునీల్‌కుమార్ అధ్యక్షత వహించారు. కొరివి వినయ కుమార్ మాట్లాడుతూ ఆయన జీవన పోరాటం నుంచే అద్భుతమైన కవిత్వాన్ని సృజంచారని గుర్తుచేశారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ రెక్కల కష్టం చేసుకుని జీవించే పేదవాడిపై జాషువా రాసిన పద్యాన్ని చదివి వినిపించి వివరించారు. అనంతరం న్యాయవాది పరిశపోగు సునీల్ కుమార్‌ను సన్మానించారు. సభలో మాదిగ జనసేవా సమితి నాయకులు అత్తోట జోసఫ్‌కుమార్, పినపాటి మోహన్‌రావు, కోట మోహన్‌రావు, పాలకాల వెంకట్, డాక్టర్ మూకిరి సుధా, పరంగ సత్య రాజు, చుండూరు జాషువా పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వారధి పోటీల్లో సత్తా చాటాలి

గుంటూరు ఎడ్యుకేషన్: పాత బస్టాండ్ సెంటర్లోని జిల్లా పరీక్షా భవన్‌లో శుక్రవారం జిల్లాస్థాయిలో వారధి పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలుగా నిలిచిన విద్యార్థులను, గైడ్ టీచర్లను ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం అభినందించారు. ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 16 నుంచి జరిగే రాష్ట్ర స్థాయి వారధి పోటీలకు జిల్లా స్థాయిలో విజేతలుగా నిలిచిన విద్యార్థులు సిద్ధంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి షేక్ గౌసుల్ మీరా, ప్రధానోపాధ్యాయురాలు జయప్రద, రిసోర్స్ పర్సన్ లు అన్నారావు, ప్రసాదరావు, రామారావు, గైడ్ టీచర్లు పాల్గొన్నారు.

వ్యాసరచన విభాగంలో..

వట్టిచెరుకూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని జె.హేమలత, నూతక్కి ఉన్నత పాఠశాల విద్యార్థిని తేజశ్రీ తొలి రెండు స్థానాల్లో నిలిచారు. డిబేట్ విభాగంలో మంగళగిరి విద్యార్థిని వి.మాధురి, బి. సంతోషిని, బేబీ సుప్రియ, అమరనాథ్ సాయి విజేతలుగా నిలిచారు.

జనసేన కార్పొరేటర్‌పై అట్రాసిటీ కేసు నమోదు

లక్ష్మీపురం: నగరపాలక సంస్థ పారిశుద్ధ్య కార్మికులు దేవరవాయి పద్మ, బజంత్రీ వెంకట్రావు, బజంత్రి పార్వతిలను అసభ్య పదజాలంతో దూషించిన నగరపాలక సంస్థ 13వ డివిజన్ కార్పొరేటర్, జనసేన పార్టీ నాయకుడు సంకూరు శ్రీనివాసరావుపై అట్రాసిటీ కేసు నమోదు చేసి శిక్షించాలని, కార్పొరేటర్ పదవి నుంచి తొలగించాలని ది గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయీస్ – వర్కర్స్ యూనియన్ (సీఐటీయూయు) జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు డిమాండ్ చేశారు. గుంటూరు నగరంలో ప్రస్తుతం విష జ్వరాలు, అంటువ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో ప్రాణాలకు తెగించి, ప్రజల ఆరోగ్యాలను కాపాడేందుకు తమ ప్రాణాలు పణంగా పెట్టి పని చేస్తున్న మున్సిపల్ కార్మికులను చెప్పటానికి అలవికాని మాటలతో, మహిళలు అని కూడా చూడకుండా నోటికి వచ్చిన బూతులు తిట్టిన సంకూరు శ్రీనివాసరావుపై చర్యలు తీసుకోవాలని కోరారు. బాధిత మహిళ, నగరపాలక సంస్థ అధికారులకు విన్నవించుకున్నా న్యాయం చేయకపోవటంతో శుక్రవారం లాలాపేట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కార్మికులను పరామర్శించిన ముత్యాలరావు, కార్మికుల న్యాయం జరిగే వరకు యూనియన్ అండగా ఉంటుందని చెప్పారు.


ప్రజా పోరాటాలకు స్ఫూర్తి ఐలమ్మ

నెహ్రూనగర్: ప్రజా పోరాటాలకు స్ఫూర్తి చిట్యాల ఐలమ్మ అని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుమ్మర క్రాంతికుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని చుట్టుగుంటలోని సంఘ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు అన్నవరపు నాగమల్లేశ్వరరావు, కొల్లూరి హనుమంతురావు, కోలా అశోక్, రవికుమార్, కోలా మణికంఠ, పూర్ణ, పాల్గొన్నారు.

తిరుగుబాటుకు స్ఫూర్తి ఐలమ్మ

బానిసత్వ సంకెళ్ల నుంచి శ్రామిక ప్రజలకు విముక్తి కలిగించిన వీరవనిత చిట్యాల ఐలమ్మ అని రజక సంఘ నాయకులు కీర్తించారు. ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని 44వ డివిజన్ ఆంజనేయపేటలో రజక సంఘం నాయకుల సమక్షంలో కేక్ కట్ చేశారు. పెత్తందారులు, రజాకారులపై చేసిన పోరాట ఫలితం మరువలేనిదన్నారు. ఆమె పోరాట పటిమను నేటి తరం యువతం కొనసాగించాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు ఉల్లగంటి శంకర్, పోకల వెంకటేశ్వరరావు, కొల్లూరి శివప్రసాదరావు, నూతలపాటి వెంకటేశ్వరరావు, పోకల వసంత్, ఓలేటి అరవింద్ పాల్గొన్నారు.

బాలకృష్ణ బేషరతుగా క్షమాపణ చెప్పాలి


మస్తాన్‌వలి

పట్నంబజారు: చేతిలో పెగ్గు.. నెత్తిన విగ్గు పెట్టుకుని మెంటల్ సర్టిఫికెట్ ఉన్న ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ నిజమైన పిచ్చోడినని అసెంబ్లీ సాక్షిగా నిరూపించుకున్నారని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి విమర్శించారు. గుంటూరు అరండల్‌పేటలోని ఆయన కార్యాలయంలో శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. తన బ్రాండ్ అయిన మ్యాన్షన్ హౌస్‌ను కడుపునిండా తాగి బాలకృష్ణ అసెంబ్లీకి వచ్చాడన్నట్లు ఉందని, అందుకే ఏ మాట్లాడుతున్నాడో అర్థం కావడం లేదని ఎద్దేవా చేశారు. ఆయన పిచ్చోడు కాబట్టే ఇంట్లో కాల్పులు జరిపారని, ఎదురుపడిన వాడినల్లా కొడుతుంటాడని విమర్శించారు. సభ్యత, సంస్కారం లేకుండా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిపై కారుకూతలు కూస్తూ పైశాచిక ఆనందాన్ని కూటమి నేతలు పొందుతున్నారని మండి పడ్డారు. సభలో కనీసం ఆ వ్యక్తి లేనప్పుడు ఆయన గురించి మాట్లాడకూదన్న ఇంగిత జ్ఞానం లేని వ్యక్తులు అసెంబ్లీలో ఉన్నారని మస్తాన్‌వలి దుయ్యబట్టారు. బేషరతుగా బాలకృష్ణ జగనన్నకు క్షమాపణలు చెప్పాలని, లేదంటే వైఎస్సార్‌సీపీ శ్రేణులు, కార్యకర్తల నుంచి తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

శని, ఆదివారాలు జొమాటో కార్మికుల సమ్మె

లక్ష్మీపురం: జొమాటో సంస్థలో పని చేస్తున్న కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం శని, ఆదివారాలు సమ్మె చేపట్టినట్లు ఆల్ ఇండియా గిగ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా కార్యదర్శి ఇ.క్రాంతి రణదేవ్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం బ్రాడీపేటలోని సంఘం నగర కార్యాలయంలో కార్మికుల జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జొమాటో కార్మికుల సమస్యలు పరిష్కారానికై గత జూన్ నెలలో 5 రోజులు సమ్మె నిర్వహించామని, ఆ సమ్మె సందర్భంగా జొమాటో యాజమాన్య ప్రతినిధులు సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారని, రెండు నెలలు తరువాత ఇచ్చిన హామీలకు భిన్నంగా కార్మికులకు ఇస్తున్న ఇన్సెంటివ్‌లు, పేఔట్‌లు తగ్గించారని, ఆర్డర్స్ శ్లాబ్‌లలో మార్పులు చేయటం ఈ విధంగా కార్మికులకు ఇబ్బందులు కలిగించే నిర్ణయాలు చేశారని అన్నారు. యూనియన్ గౌరవాధ్యక్షులు బి.ముత్యాలరావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బి.లక్ష్మణరావు మాట్లాడారు. సమావేశంలో జొమాటో కార్మికులు నరసింహరావు, వాల్మీకి, వెంకట్, బెస్తాని నాగేశ్వరరావు, శివ, లక్ష్మీనారాయణ, షేక్ అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్‌పై చర్యలు తీసుకోవాలి

లక్ష్మీపురం: గుంటూరు సంగడిగుంట 13వ డివిజన్ కార్పొరేటర్ సంకూరు శ్రీనివాసరావు పారిశుద్ధ్య కార్మికులపై దుర్భాషలాడిన ఘటనపై ఏఐటీయూసీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం గుంటూరు కొత్తపేటలోని కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మేడా హనుమంతరావు మాట్లాడారు. వెంటనే క్షమాపణలు చెప్పాలని అన్నారు. కార్మికులపై అసభ్యంగా ప్రవర్తించిన కార్పొరేటర్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఆకిటి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ, ముఖ్యంగా మహిళా కార్మికులను లక్ష్యంగా చేసుకొని దుర్భాషలాడటం అత్యంత తక్కువ స్థాయి చర్య అని తీవ్రంగా ఖండించారు. సమావేశంలో కార్మిక నాయకులు మంగా శ్రీనివాసరావు, పీవీ జగన్నాథం పాల్గొన్నారు.